# 21. మహాపతివ్రతల దేశంలో....

స్వల్పంగా జీతాలు పెరిగినా అంతకంటెక్కువ ధరలు పెరుగుతాయని తెలుసుండి కూడా—జీతాలు పెరగకున్నాపరే ధరలు స్థిరంగా ఉంచమని ఆందోళన చేయకుంటు—తమ ఆకలిపేగుల అరుపులు గద్దెలపై వున్న ప్రభువులకు వినబడవని తెలిసికూడా జీతాలు పెంచమని సమ్మెలు చేసే చిరుద్యోగుల్లా చెట్టు దగ్గరికెళ్ళాడు కోదండరావు—చెట్టెక్కి శవాన్ని భుజంపై వేసుకొని చెట్టుదిగి తొందరగా చేరుకోవాలని శ్మశానం దిక్కు నడుస్తున్నాడు—శవంలోని భేతాళుడతనితో

“ఓ మనిషీ! నీ నెరిసిన తల, తెల్లగడ్డం, ముఖంపైముడతలు నువ్వు జీవితానుభవాలతో పండినవాడివని చెబుతున్నాయి- నా ఊహే నిజమైతే నువ్వు కుటుంబ సమస్యల భారంతో తలమునకలవుతున్నట్టగుపడుతున్నావు—అవునా—?” అన్నాడు—

“దశమగ్రిహాల్లాంటి అల్లుల్ల కోర్కెలు తీర్చలేక సతమతమవుతున్నాను—పెళ్ళయింతర్వాత కూడా ప్రతిసారీ ఏదోనెపంతో కూతుర్లను పుట్టింటికీ పంపిస్తే ఏం చేసేది—? కట్నాలు, కానుకలు ఎంతకాలమని పెట్టేది—? నలుగురు కూతుర్లున్న నా బ్రతుకేంకావాలి—? వాళ్ళ పెళ్ళిళ్ళకే ఉన్నదంతా ఊడ్చుకపోతే ఇంకేం మిగిలిందని ఇవ్వాలి...? తనలో తాననుకొని....

నన్ను మాట్లాడించి మళ్ళీ చెట్టెక్కి కూచుందామని చూస్తుడీ భేతాళుడు—ఈ సారెలాగైనా సాధించి తీరుతాను—' అనుకుంటూ మౌనంగా

శ్మశానం దిక్కు అడుగులేస్తున్నాడు కోదండరావు — "ఓ మానవా! నువ్వు చెప్పకున్నా నీ ప్రయత్నం నాకు తెలుసు—నీకో కథ చెబుతాను విను—" అని కథ చెప్పడం ప్రారంభించాడు భేతాళుడు—

అది మహర్షులు పుట్టిన దేశం—మహా ప్రతివ్రతలు మెట్టిన పుణ్య భూమి — ఆ దేశంలోని ఓ సాంప్రదాయ మధ్యతరగతి కుటుంబంలో పుట్టింది అనూరాధ — చిన్నప్పట్నుంచే ఆమె తల్లిదండ్రులామెకు ఆ దేశంలోని పతివ్రతామతల్లుల కథలు గూర్చి నూరిపోశారు-చనిపోయిన భర్త గూర్చి యమధర్మరాజుతో పోట్లాడిన సతీసావిత్రి గూర్చి చెప్పారు కుష్టువ్యాధి పీడితుడైనా భర్తను వేశ్యదగ్గరికి మోసుకెళ్ళిన సతీసుమతి గూర్చి బోధించారు-భర్త మాటను జవదాటకుండా భర్త తనను అమ్మితే అమ్ముడుబోయిన చంద్రమతి గూర్చి ఘనంగా చెప్పారు—తనేం తప్పు చేయకున్నా భర్త తన నడవులకు పంపితే పోవడమే కాకుండా అలాంటి భర్తే జన్మజన్మలకూ కావాలని కోరుకున్న సీతాసాధ్వి గూర్చి గొప్పగా చెప్పారు—

భర్త చెప్పినట్టల్లా చేయాలని ఎదురు మాట్లాడకూడదని, అత్త మామలను గౌరవించాలని, పుట్టింటికి, మెట్టింటికి పేరుతేవాలని పదేపదే చెప్పారు—ఎన్ని కష్టాలున్నా, ఎలాంటి పరిస్థితులున్నా స్త్రీకి అత్తగారిల్లే స్వర్గంలాంటిదని ఉగ్గుపాలతో నూరిపోసారు—డిగ్రీ చదివిన అనూరాధకు చిన్నప్పట్నుంచీ తల్లిదండ్రులు బోధించిన మాటలే ఒంటబట్టాయి — చదువయి పోయింతర్వాత ఆమెకు భారీగా కట్నమిచ్చి ఓ విద్యాధికుని తోనే పెళ్ళిచేసారు...

అనూరాధ మెతక ప్రవర్తన దురాశపరుడైన ఆమె భర్తకు,

అత్తమామలకు లోకువైంది—ఆమెను వేధించడం మొదలుపెట్టారు—మాటి మాటికీ డబ్బు తెమ్మని పీడించసాగారు. అనూరాధ తల్లిదండ్రులు సాధ్యమైనంతవరకు అల్లుని కోర్కెలు తీర్చడానికే ప్రయత్నించారు—వాళ్ళనెత్తురు రుచిమరిగిన పులుల్లా డబ్బు రుచిమరిగారు— ఆమె తల్లిదండ్రులెంత డబ్బిచ్చినా వాళ్ళకోర్కెలు పెరుగుతూనేవున్నాయి -- కొంత కాలం తర్వాత ఇక తమనుంచి కాదని ఆమె తల్లిదండ్రులు చేతులెత్తారు. అనూరాధకు అత్తవారింట్లో పోరు అధికమైంది-వేధించడం మొదలెట్టారు రోజురోజుకూ పరిస్థితులు విషమిస్తుంటే తన పరిస్థితిని గూర్చి తల్లిదండ్రులతో చెప్పుకుంది—తానా ఇంట్లో ఉండలేనంది-కాని, ఆమె తలిదండ్రులు భర్తనుండి స్త్రీ దూరంగా వుండటాన్ని సంఘం ఒప్పుకోదని అత్తవారింట్లోనే ఉండి సరిచేసుకొమ్మని చెప్పారు—

ఎన్ని రోజులు గడచినా ఆమెభర్త ప్రవర్తనలో మార్పులేదు... ఎంత అణగిమణగి వున్నా భర్తనెంత దైవమని చూసుకున్నా అత్తవారింట్లో ఆమె బ్రతుకు దుర్భరమైంది తల్లివారింటినుంచి డబ్బుతేవడం మానుకున్న అనూరాధను భర్తకొట్టడం, అత్తమామలు రాచిరంపాన పెట్టడం ఎకువైంది, భర్తను ,అత్తమామలను ఎదిరించే ధైర్యమామెకు లేదు... ఆ బతుకులో విసిగిపోయింది అనూరాధ- ఈ దేశంలోవి చాలామంది ఆడపిల్లల్లాగే బ్రతుకంటే రోసి ఆత్మహత్యచేసుకుంది—

కథ చెప్పడం ఆపి భేతాళుడు

"విద్యావంతురాలైయుండి, తనకాళ్ళమీద తాను నిల్చోగలిగి బ్రతికే చదువుండి కూడా అనురాధ ఎందుకాత్మహత్య చేసుకుంది ?

ఆమె నిర్ణయం సరైందేనా...?

ఈ విషయంలో ఎవరు శిక్షార్హులు...?

ఈ ప్రశ్నలకు జవాబులు తెలిసీ చెప్పకపోయావో నిన్ను ఘోరాతి ఘోరంగా శపిస్తాను...'' అని మౌనం వహించాడు.

"అనురాధకు తల్లిదండ్రులు పతివ్రతల కథలు చెప్పారే కాని జీవితాన్నెలా ఎదుర్కోవాలో చెప్పలేదు. సమస్యలకెదురునిలిచి ధైర్యంగా ముందుకు సాగిపొమ్మని చెప్పక పిరికిమందు పోసి పెంచారు. భర్తెలాంటి వాడైనా సర్వస్వంగా భావించి బ్రతుకాలని తెలిసిన అనురాధకు భర్త నుండి వేదన ప్రారంభ కావడంతో జీవితంపై విరక్తి పుట్టింది. భర్త అండలేందే స్త్రీ బ్రతుకలేదన్న తప్పుడు ఆలోచన వల్ల ఆమె దుర్మార్గుడైన భర్తనెదిరించడానికి బదులు హింసింపబడి ఆత్మహత్య చేసుంది. తనకాళ్ళపై నిల్చొని బతికే చదువు శక్తి ఉండికూడా సమాజాన్ని మరో దృక్కోణంలోంచి చూసే విధానం తెలియక ఆత్మహత్యచేసుకుంది అందుక్కారణం తల్లిదండ్రుల పెంపకంలోని లోపం ముఖ్యమైంది.

ఆమె నిర్ణయం ఎట్టి పరిస్థితిలోనూ సరైందికాదు. భర్త దుర్మార్గుడైతే ఆత్మహత్యే శరణ్యం కాదు భర్త లేకున్నా ధైర్యంగా బతుకును ముందుకు కొనసాగించగలుగాలి ఆలాంటివాళ్ళే సమాజంలో ఎంతో ముందున్నారు.

అనూరాధ ఆత్మహత్యకు కారకులైన భర్త అత్తమామలతోపాటు ఆమెకు జీవితంపై సరియైన అవగాహన కల్గించకుండా పిరికిమందు పోసి పెంచిన ఆమె తల్లిందడ్రులు కూడా ఈ విషయంలో శిక్షార్హులే...

కోదండరావునుంచి తానాశించిన సమాదానాలు రాగానే శవంతోపాటు మాయమై చెట్టెక్కాడు భేతాళుడు.

[ జీవగడ్డ జనవరి, 1987. ]